అభివృద్ధిలో కీలక పాత్ర

- ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం
- ప్రజాప్రతినిధులను సన్మానించిన అధికారులు


నాయకులను సన్మానిస్తున్న కార్యదర్శులు


ఎంపీపీ విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న అధికారులు

కౌటాల: మండలాభివృద్ధిలో మండల ప్రజాపరిషత్ పాలకవర్గ సభ్యుల పాత్ర కీలకమని డీఆర్డీవో సురేందర్ అన్నారు. పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలోని జగదాంబ గార్డెన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, కోఆప్షన్, ఎంపీటీసీ సభ్యులను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. జిల్లాలోనే అభివృద్ధి, ఆదర్శ పాలన అందించడంతో కౌటాల మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించమని, రానున్న రోజుల్లో ప్రజాసేవ చేస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, జెడ్పీటీసీ సభ్యులు డి అనూష, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీవో పూర్ణిమ పాల్గొన్నారు.

కెరమెరి: ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఐదేళ్ల పదవీకాలం ఈనెల 5న ముగియడంతో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాంలను ఘనంగా సన్మానించారు. వారిని శాలువాతో సన్మానించారు. ఐదేళ్లలో వారు చేసిన అభివృద్ధిని కొనియడారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్ పాషా, కార్యాలయ సిబ్బంది సుధాకర్ రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పాలకవర్గ సభ్యులను బుధవారం అధికారులు సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మండలంలో ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేశామన్నారు. మండలాభివృద్ధికి తమ వంతు కృషి చేశామన్నారు. పదవులు లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను అధికారులు, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు శ్రీదేవి, కోఆప్షన్ సభ్యులు నాజీం హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సమస్యలను పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేశారని ఎంపీడీవో మాధవీలత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు మండలంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేలా ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తి కావడంతో వారితో కలిసి పనిచేసిన రోజులు


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపీపీ దుబ్బుల నానయ్య

మర్చిపోలేనివని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎంపీపీ దొకే రోజా రమణి మాట్లాడుతూ మండలంలోని అధికారులు స్నేహభావంతో మెలిగారన్నారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఎంపీడీవో, ఎంపీవో రమేష్, ఏవో రాజుల నాయుడు, ఎంఈవో రమేశ్‌బాబు, సహకార సంఘ చైర్మన్ ఓం ప్రకాశ్ ఘనంగా సన్మానించారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కౌటాల: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కౌటాల ఎస్సై మధుకర్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. యువత నేరాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను అధికంగా వాడవద్దన్నారు. సైబర్ నేరాలకు గురితే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్, అధ్యాపకులు ఆంజనేయులు, మోతి లాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్సై నరేశ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే పోలీసులను సంప్రదించాలన్నారు.

బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి అప్పగించాలి


మాట్లాడుతున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేయకుండా సింగరేణి సంస్థకే అప్పగించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో కార్మికులతో సమావేశమయ్యారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని ఏఐటీయూసీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు బ్లాకుల వేలంను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణికి బొగ్గు బ్లాకుల సాధన కోసం శుక్రవారం నుంచి ఈనెల 18వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. సమావేశంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఆనంద్, శేషయన రావు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దేవరకొండ దివాకర్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఓదెలు, షకీల్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా మహిళాసాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సంకల్ప్, హబ్ ఫర్ ఎంపవర్మేంట్ ఆఫ్ వుమెన్ కార్యక్రమంలో భాగంగా నూతన చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్టు రాణి మాట్లాడుతూ జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు ఆపేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఫోన్ చేయాలన్నారు. ఎస్సై మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరుగుతున్నందున అదేస్థాయిలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాజు

జైనూర్: మారుమూల గిరిజన గ్రామాల్లో రక్తహీనతను నివారించేందుకు సికిల్‌సెల్ ఎనిమియా ఎలిమినేషన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని వైద్యాధికారి రాజు అన్నారు. బుధవారం మండలంలోని దేవుగూడలో అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ నాణ్యమైన పోషకాహారం తీసుకోవడం వలన కొంత మేర రక్త హీనతను అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను విమర్శించడం సరికాదు


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఆదివాసీ విభాగం జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో పర్యటించిన ఆయన అంకోలి గ్రామంలోని కుమరం భీం విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు అనేక అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మతిస్థిమితం, విచక్షణ కోల్పోయి మాట్లాడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ గౌడ్, కాంతా రెడ్డి, బడుగు గంగన్న, కిషన్, సత్యనారాయణ, ఆనంద్ రావ్, మెస్రం శంకర్, లస్మ రెడ్డి, ముత్తన్న, అశోక్, రమేశ్, అఫ్సార్, తిరుపతి, పెద్ద స్వామి, చిన్నస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

నార్నూర్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉర్వేత రూప్‌దేవ్, అడే సురేశ్‌లు అన్నారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేయడంతో పాటు ఆమెను అవమానించేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయకులు తోడసం నాగోరావ్, మెస్రం హనుమంతరావు, విష్ణు ఫడ్, సయ్యద్ ఖాసిం, శివాజీ రాథోడ్, సుభాష్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వారసంత వేలం వాయిదా

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామ పంచాయతీలో బుధవారం నిర్వహించే వారసంత వేలంను శుక్రవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాధా ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి బకాయిలు ఉండరాదని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాల్‌లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు మండల ప్రజాప్రతినిధులకు సహకరించి అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. ఎంపీటీసీలకు ఇదే చివరి సమావేశం కావడంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌ను మండల ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, స్వదేశ్‌శర్మ, బాబా, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గౌరీశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీ టీం సిబ్బంది

రెబ్బెన: అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, వాట్సాప్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుకొని పరిస్థితుల్లో ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో 100కి డయల్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయరాణి, షీటీం సిబ్బంది హెచ్‌సీ సునీత, శ్రీలత, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకే రేషన్ దుకాణం కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన: వంకులంలోని రేషన్ దుకాణాన్ని స్థానికులకే కేటాయించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి అత్మకూరి సతీష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంకులం రేషన్‌షాపును మండల కేంద్రానికి చెందిన శంకర్‌లాల్ జైస్వాల్ నిర్వహిస్తున్నాడని, అతనికి రెబ్బెన మండల కేంద్రంలో మరో రేషన్ దుకాణం ఉందన్నారు. రెబ్బెన దుకాణంపై పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేయడంతో అదనపు బియ్యం నిల్వలు బయటపడ్డాయన్నారు. అయినప్పటికీ వంకులంలోని దుకాణాన్ని శంకర్‌లాల్ జైస్వాల్‌యే నిర్వహిస్తున్నాడని వెంటనే స్థానికులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి నీలేష్, తదితరులు పాల్గొన్నారు.

'దూషించడం సరికాదు'


మాట్లాడుతున్న కుసుంబ్‌రావు

కెరమెరి: ప్రోటోకాల్ విషయమై డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసభ్య పద జాలంతో దూషించడం సరికాదని, తన మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ బిడ్డగా ప్రజలు గెలిపించారని అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. కార్యక్రమంలో బాబు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన 8 ఏళ్ల చిన్నారి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జోయా షెహరీన్ (8) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. 10 రోజుల క్రితం జ్వరం రాగా కుటుంబసభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అయితే రెండు రోజుల తరువాత మరో సారి జ్వరం రాగా జాండిస్ అయినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది.

బాధిత కుటుంబానికి చేయూత

లింగాపూర్: మండలంలోని కీమానాయక్‌తండాకు చెందిన నిరుపేద రైతు జాదవ్ యాదగిరి గత నెల ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా.. బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా జైనూర్ సీఐ అంజయ్య, లింగాపూర్ ఎస్సై కోట్టే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం, గోధుమలు, పప్పు, సరుకులు పంపిణీ చేశారు.

సన్మానం

జైనూర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని మార్లవాయి గ్రామంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు అందించిన సేవలు మరువ లేనివన్నారు. అనంతరం మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో కుక్ ఉమెన్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందడంతో ఆమెను శాలువా సన్మానించారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకట్వేరరావు, మాజీ సర్పంచి కనక ప్రతిభ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఎంపిక జాబితా విడుదల కాగా.. మోడల్ స్కూల్‌కు చెందిన సోనులే తిరోజ, మసాదే మనస్విని, గుండేటి భావన సీటు సాధించారని పేర్కొన్నారు. వీరు పదో తరగతిలో 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని గజ్జిగూడ గ్రామానికి చెందిన చిలుకూరి అనిత, రమ్యలు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా.. వారి అంత్యక్రియలకు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ఆర్థిక సాయం చేశారు. అనిత కూతురు రవళికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు.

యువకుల శ్రమదానం


మొరం వేస్తున్న యువకులు

బెజ్జూర్: ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీలో వర్షపునీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం గ్రామ యువకులు రెండు ట్రాక్టర్ల మొరం వేయించి శ్రమదానం చేశారు. దీంతో గ్రామస్తులు యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్లెల శ్రీకాంత్, షాకీర్ హుస్సేన్, మోయిన్ ఖాన్, జహీద్ ఖాన్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీ బలరామ్‌నాయక్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న సునీల్ కుమార్

లింగాపూర్: మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరామ్ నాయక్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని జిల్లా ఎస్టీసెల్ వైస్ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం గిరిజన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్టీలకు ఎవరికీ టీపీసీసీ పదవి దక్కలేదన్నారు. కార్యక్రమంలో జాదవ్ రమేశ్, శంకర్, బలరాం, ఆత్రం జంగు పాల్గొన్నారు.

వారసంత వేలం

బెజ్జూర్: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంత వేలంను బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా.. మండల కేంద్రానికి చెందిన సామల వెంకటేశం తొమ్మిది నెలలకు రూ.2 లక్షల 20 వేలకు వేలం పాడి దక్కించుకున్నట్లు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి వెంకటేశం తెలిపారు. వారసంతలో సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారాం, ప్రజలు పాల్గొన్నారు.

సాగు వివరాలు నమోదు


వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో వెంకటేశ్

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో వానాకాల పంటల సాగు వివరాలను బుధవారం ఏఈవో వెంకటేశ్ సేకరించారు. సాగు చేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలు ఎన్ని పండించినా.. ఆన్‌లైన్‌లో నమోద చేస్తేనే, కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర లభిస్తుందన్నారు. పంటలను విక్రయించేందుకు అనుమతి లభిస్తుందన్నారు. ప్రతీ రైతు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపు రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్ రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్ బాబు జన్మదినం సందర్భంగా శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఎంపీ నగేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. రక్తదాతలకు లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పించనున్నామని, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని కోరారు.

గుట్కా పట్టివేత


పట్టుకున్న గుట్కా ప్యాకెట్లతో ఎస్సై

కెరమెరి: మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో నిషేధిత గుట్కా విక్రయిస్తున్న తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం ఆయన దుకాణంలో తనిఖీ చేయగా.. రూ.1200 విలువ గల గుట్కా లభ్యమైందన్నారు. ఎవరైనా గుట్కా అమ్మితే, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగాపూర్: మండల కేంద్రంలో బుధవారం ఏఎస్సై తులసిరాం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పోగాకు, తంబాకు పట్టుకున్నారు. షేక్ ఇస్మాయిల్ దుకాణంలో తనిఖీలు చేయగా.. భారీగా గుట్కా పట్టుబడిందన్నారు. గుట్కా విక్రయిస్తున్న ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మాజీ ఎంపీ బీజేపీ నేత రాథోడ్ రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కటిపెల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకులు రాథోడ్ రమేశ్ ఇంటికి చేరుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్, రమణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

తిర్యాణి: మిషన్ భగీరథ, ఎస్బీఎం సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఎస్బీఎం ఇన్‌చార్జి వనమాల ఫణి పాల్గొన్నారు.